కనిపించని పన్ను పురోగతి

- ఇక మిగిలింది 13 రోజులే
- నోటీసులు ఇస్తున్నా స్పందన కరువు
- రూ.కోట్లలో పేరుకుపోయిన బకాయిలు
- ఈ నెలాఖరు నాటికి లక్ష్యం సాధ్యమేనా?

రాయదుర్గం: మున్సిపాలిటీ అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతోపాటు ఆస్తి పన్ను కూడా దోహదపడుతుంది. అయితే పన్ను వసూళ్లలో పురోగతి కనిపించలేదు. ఓ వైపు లక్ష్యం చేరుకోవాలంటే ఇక మిగిలింది 13 రోజులే. రెడ్ నోటీసులు జారీచేసినా, రెట్టింపు వడ్డీలు చెల్లించాల్సి వస్తోందని భయం చెప్పినా కొందరిలో స్పందనలేదు. 2024–25 టార్గెట్ పూర్తి చేయడం సాధ్యమేనా? అనిపిస్తోంది. మున్సిపల్ కమిషనర్ నేరుగా వార్డుల్లో తిరుగుతూ ఇంటి పన్ను, నీటి పన్ను చెల్లించాలని అడగాల్సిన పరిస్థితి వచ్చింది. జిల్లాలోని కర్ణాటక సరిహద్దునున్న రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలోని 2024–25 వ ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను డిమాండ్ రూ.5.33 కోట్లు లక్ష్యం నిర్దేశించారు. నేటి వరకు రూ.3.36 కోట్లు వసూలు అయ్యింది. రూ.1.97 కోట్లు వసూలు కావాల్సి ఉంది. మొత్తం నీటి పన్ను లక్ష్యం రూ.3.41 కోట్లు కాగా, రూ.2.15 కోట్లు మాత్రమే వసూలు అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వ ఆస్తుల నుంచి రూ.2.57 కోట్లకు రూ.2.82 లక్షలు మాత్రమే వసూలు చేశారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధిన ఆస్తుల నుంచి రూ.36 లక్షలు లక్ష్యం కాగా, అతి తక్కువగా రూ.10,888 మాత్రమే వసూలు అయ్యింది. ఖాళీ స్థలాల నుంచి రూ.2.68 కోట్లకు గాను రూ.18 లక్షలు వసూలు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు, ఖాళీ స్థలాలు, నీటి పన్ను అంతా కలిపి సుమారు రూ.14.35 కోట్లు వసూలు కావాల్సి ఉండగా, ప్రస్తుతం రూ.8.66 కోట్లు మాత్రమే వసూలయ్యింది. ఈ నెల 31 నాటికి రూ.5.69 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.

వార్డుల్లో పర్యటిస్తున్న అధికారులు

పట్టణంలోని 32 వార్డుల్లోనూ పన్ను వసూలు కోసం అధికారులు పర్యటిస్తున్నారు. ప్రత్యేకంగా వార్డు సచివాలయాల్లోని ఇతర శాఖల ఉద్యోగులతో పాటు మున్సిపాలిటీలోని పలు విభాగాలకు చెందిన అధికారులను నియమించారు. వీరంతా ఇతర పనులు పక్కన పెట్టి పన్ను వసూలుపైనే ప్రత్యేక దృష్టి సారించారు.

మున్సిపాలిటీ పరిధిలోని పన్ను వసూలు లక్ష్యం వివరాలు ఇలా..

పట్టణ జనాభా	75 వేలు
వార్డులు	32
వార్డు సచివాలయాలు	18
ఆస్తిపన్ను డిమాండ్	రూ. 5.33 కోట్లు
వసూలు అయినది	రూ. 3.36 కోట్లు
నీటి పన్ను డిమాండ్	రూ.3.14 కోట్లు
వసూలు అయినది	రూ. 2.15 కోట్లు
ప్రభుత్వ కార్యాలయాల డిమాండ్	రూ.2.57 కోట్లు
వసూలు అయినది	రూ. 2.82 లక్షలు
సెంట్రల్ కార్యాలయాల డిమాండ్	రూ.36 లక్షలు
వసూలు అయినది	రూ.10,888
ఖాళీ స్థలాల డిమాండ్	రూ.2.68 కోట్లు
వసూలు అయినది	రూ.18 లక్షలు


రాయదుర్గం మున్సిపల్ కార్యాలయం

నెలాఖరులోపు లక్ష్యం చేరుకుంటాం



ఆస్తి, నీటి పన్నుతో పాటు ప్రభుత్వ కార్యాలయాల నుంచి పన్ను వసూలు కావాల్సి ఉంది. ఈ వసూళ్ల ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాం. ఆస్తి, నీటి పన్నుల వసూలు 68 శాతం పూర్తయింది. ఖాళీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఆశించిన స్థాయిలో వసూలు కావడంలేదు. ప్రత్యేక సిబ్బందిని నియమించి ఇంటింటా తిప్పుతున్నాం. లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. ఈ నెల ఆఖరి లోపు టార్గెట్ పూర్తి చేసేలా కృషి చేస్తాం. – దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

క్లుప్తంగా

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా


మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొట్రేష్

రాయదుర్గంటౌన్: ఉద్యోగాలైనా ఇవ్వండి, నిరుద్యోగ భృతి అయినా ఇవ్వండి అనే నినాదంతో రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో 17న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొట్రేష్ తెలిపారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇస్తామని, 25 వేల మెగా డీఎస్సీ ప్రకటిస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వలంటీర్లను రూ.10 వేలతో కొనసాగిస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు కుమార్, నాగయ్య, గంగాధర్, కార్తీక్ పాల్గొన్నారు.

నాటు సారా నిర్మూలనపై కళాజాతా


నాటుసారా నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

కంబదూరు: మండలంలోని రాళ్లపల్లి, డి. చెన్నంపల్లి గ్రామాల్లో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ సునిల్‌కుమార్, ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం నవోదయం 2.0 లో భాగంగా నాటు సారా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తరిమెల రాజు కళాజాతా బృందం నాటుసారా నిర్మూలనపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించారు. నాటు సారా తాగితే జరిగే అనర్థాలు, నష్టాలపై పాటల రూపంలో చక్కగా అవగాహన కలిగించారు. నాటు సారా తాగితే ఆరోగ్యం ఎలా దెబ్బతింటుందో వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీసు సిబ్బంది, కళాకారులు పాల్గొన్నారు.

భానుడి ప్రతాపం


నిర్మానుష్యంగా కనిపిస్తున్న రాయదుర్గం ప్రధాన రహదారి

రాయదుర్గంటౌన్: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఆదివారం గరిష్ట ఉష్ణోగ్రత 38 డిగ్రీలు నమోదైంది. శనివారం వరకు 37 డిగ్రీలు ఉన్న ఉష్ణోగ్రత.. ఆదివారం పెరిగిపోయింది. దీంతో ప్రజలు మధ్యాహ్నం 12 గంటలు దాటితే రోడ్లపైకి రావడం లేదు. ఎండతోపాటు వేడిగాలి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరివుతున్నారు. కాలనీలు, వీధుల్లో సైతం ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఎండవేడిమిని తట్టుకునేందుకు ప్రజలు శీతలపానీయాలు వైపు మొగ్గు చూపుతున్నారు. కూల్‌డ్రింక్ షాపులు, కళింగర కాయలు, కొబ్బరి బోండాల వ్యాపారాలు ఊపందుకున్నాయి. వ్యవసాయ తోటల్లో ఏర్పాటు చేసిన నీటి తొట్టెల్లో ఈత కొడుతూ సేద తీరుతున్నారు.

గాలికుంటు నివారణ టీకా వేయించాలి


టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ డీడీ వెంకటేశ్

బెళుగుప్ప: పశుపోషకులు గాలికుంటు నివారణ టీకా వేయించాలని పశుసంవర్ధక శాఖ డీడీ జి.వెంకటేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని కాలువపల్లి గ్రామంలో గాలికుంటు నివారణ టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. గాలికుంటు నివారణ టీకా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు రవితేజ, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద కారకులను గుర్తించండి

కళ్యాణదుర్గం రూరల్: ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయిన వాహనాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీసులకు బాధితుడు వన్నూరుస్వామి ఆదివారం ఫిర్యాదు చేశాడు. మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి గ్రామం వద్ద శనివారం సాయంత్రం ద్విచక్ర వాహన అదుపు తప్పి నరసాపురానికి చెందిన ఆయా లక్ష్మీదేవి మృతి చెందిగా, భర్త వన్నూరుస్వామి తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డు ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వైభవంగా నాయకన హట్టి రథోత్సవం


కర్ణాటకలోని నాయకనహట్టిలోని గురు తిప్పేరుద్రస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయదుర్గంటౌన్: కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో పట్టణానికి 45 కిలో మీటర్ల దూరంలో కర్ణాటకలోని చెళ్లకెర తాలూకా నాయకహట్టిలో వెలసిన మహిమాన్వితుడు శ్రీగురు తిప్పేరుద్రస్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. సాయంత్రం 5 గంటలకు రథోత్సవాన్ని ప్రారంభించారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కేఎస్ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సు సర్వీసులు నడిపింది. రథోత్సవానికి కర్ణాటక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు హాజరయ్యారు.

బ్రహ్మసముద్రం : మండలంలోని ఎరడికెరలో గురు తిప్పేరుద్ర స్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం చిన్న రథోత్సవం అనంతరం మధ్యాహ్నం రథపూజ, బలి అన్న సమర్పణ చేసి, స్వామిని పల్లకీలో ఊరేగింపుగా తీసుకొచ్చి బృహత్ రథంలో ప్రతిష్టించారు. స్వామి పాదాల కట్ట వరకు రథోత్సవం సాగింది. అనంతరం స్వామి పల్లకీ ఉత్సవంలో ఆలయానికి చేర్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి , రైతు సంఘం గోపాల్ రెడ్డి, ఎర్రిస్వామి , ఎల్లప్ప, తిమ్మారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రథోత్సవంలో పాల్గొన్నారు.


గురుతిప్పేరుద్రస్వామి రథోత్సవం

కుందుర్పి: మండల సరిహద్దునున్న గురుతిప్పేరుద్రస్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం నేత్ర పర్వంగా సాగింది. ఉదయం స్వామివారికి పాలాభిషేకం, మధ్యాహ్నం మడుగు రథోత్సవం, సాయంత్రం ధూళోత్సవం సందర్భంగా స్వామి రథం గ్రామ వీధుల గుండా సాగింది. భక్తులు అరటి పండ్లు, తమలపాకులు రథంపై వేసి మొక్కులు చెల్లించుకున్నారు. వేలాది మంది భక్తులు హాజరయ్యారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం


ధ్వజస్తంభ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలవ

కణేకల్లు:మండలంలోని కణేకల్లుక్రాస్‌లో నూతనంగా నిర్మించిన శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా జరిగింది. ఆదివారం ఉదయం ఆలయంలో మహాన్యాస, సుందరకాండ పారాయణం, నవగ్రహ పూజ, రుద్రాభిషేకం చేసి వేదమంత్రులను పఠిస్తూ ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. అనంతరం శిఖర కలశ ప్రతిష్ట, గణపతి హోమం, రుద్రాహోమాలు జరిపించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ధ్వజస్తంభ ప్రతిష్టలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కణేకల్లు మేజర్‌గ్రామ పంచాయతీ మాజీ సర్పంచు యు.కౌసల్య, మాజీ ఉప సర్పంచు ఆనంద్‌రాజ్, కణేకల్లు చెరువు సంఘం అధ్యక్షుడు బీటీ రమేష్, గరికపాటి ఆదినారాయణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏడు కేంద్రాల్లో జరగనున్న పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ నాగమణి తెలిపారు. ఆదివారం పరీక్ష కేంద్రాల్లో టేబుళ్లపై హాల్‌టికెట్ల నంబర్ల కేటాయింపు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. పట్టణంలోని ఏడు కేంద్రాల్లో మొత్తం 1,484 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 21 కేంద్రాల్లో 4,528 మంది పరీక్షలు రాస్తారన్నారు. విద్యార్థులు పరీక్ష రోజు ఉదయం 8:30 గంటలకు కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 8:45 నుంచి 9:30 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని తెలిపారు. 12.45 వరకు పరీక్ష జరుగుతుందన్నారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

గుమ్మఘట్ట: మండలంలోని బీటీపీ, గుమ్మఘట్ట, గోనబావి కేంద్రాల్లో జరగనున్న పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ నాగమణి తెలిపారు. మండలంలోని 11 ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఎంజేపీ గురుకుల పాఠశాలల్లో 674 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

టెన్త్‌పరీక్షలకు 804 మంది విద్యార్థులు

వజ్రకరూరు: మండలంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు 804 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు ఎంఈఓ తిమ్మప్ప తెలిపారు. ఆదివారం వజ్రకరూరులో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ వజ్రకరూరులోని కేవీజెడ్పీ ఉన్నత పాఠశాల, కొనకొండ్ల జెడ్పీహెచ్ఎస్, ఆదర్శ పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో హాల్‌టికెట్స్ చూపిస్తే ఉచితంగా బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. పరీక్షలకు ముగ్గురు చీఫ్ సూపరింటెండెంట్లు, ముగ్గురు డిపార్ట్‌మెంట్ అధికార్లు, 39 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు.

10వ తరగతి విద్యార్థులకు బస్సు సౌకర్యం

బొమ్మనహాళ్: మండలంలోని చంద్రగిరి ఉన్నత పాఠశాల పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థుల సౌకర్యార్థం జిందాల్ సావ్ ఫ్యాక్టరీ యజమాన్యం బస్సు ఏర్పాటు చేసింది. చంద్రగిరి హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కేంద్రం ఉద్దేహాళ్ గ్రామంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు 12 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉంటుంది.

రహదారి కోత...రాకపోకలకు వెత


కల్లుదేవనహళ్లి వద్ద ఇసుకలో ఇరుక్కుపోయిన ఆటోను బయటకి తీసే ప్రయత్నం చేస్తున్న ప్రజలు

బొమ్మనహాళ్: కల్లుదేవనహళ్లి గ్రామం నుంచి సంగమేశ్వరస్వామి ఆలయం మీదుగా సింగానహళ్లి గ్రామానికి వెళ్లే రోడ్డు వేదావతి హగరిలో కోతకు గురైంది. నెలలు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. గతేడాది అక్టోబర్, నవంబర్ నెలలో వేదావతి హగరికి వరద పోటెత్తడంతో కల్లుదేవనహళ్లి వద్ద సింగానహళ్లికి వెళ్లే రోడ్డు భారీ ఎత్తున కోతకు గురైంది. ఈ మార్గంలో రాకపోకలకు ప్రజలు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ట్రాక్టర్లు వేదావతి హగరి నదిలోని ఇసుకలో ఇరుక్కుపోతున్నా గత్యంతరం లేకపోయింది. ఈ విషయాన్ని పీఆర్ ఇంజనీర్ జగదీష్ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా, పరిశీలించి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతామన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

వజ్రకరూరు: గంజికుంట గ్రామంలో ఆదివారం బంగారునంది అవార్డు గ్రహీత , ఎస్సీ,ఎస్టీ హక్కుల పరిరక్షణ సమితి శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు ఉమ్మల చంద్రశేఖర్ ఉదారతను చాటుకున్నారు. ఆదివారం గ్రామంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, ఇతర సామగ్రి అందించారు. ఉమ్మల చంద్రశేఖర్ మాట్లాడుతూ తన సొంతూరులో చేతనైన సహాయం చేయాలని భావించి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త శ్యాంప్రసాద్, ఆర్టీటీ ఏటీఎల్ దేవరాజు, ఉపాధ్యాయులు ఓబన్న, సరస్వతి, ఆర్గనైజర్లు కౌషిక్, నితిన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన : గంజికుంట ఆర్టీటీ పాఠశాల ఆవరణలో ఉమ్మల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. వైద్యశిబిరంలో షుగర్ పరీక్షలతోపాటు బీపీ, సాధారణ జబ్బులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు. 200 మందికి వైద్య పరీక్షలు చేశారు.

రోడ్డు పక్కన ప్రమాదకరంగా కేబుల్ గుంతలు

బొమ్మనహాళ్: కళ్యాణదుర్గం–బళ్లారి ప్రధాన రహదారి పక్కన కేబుల్ గుంతలు ప్రమాదకరంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గం గుండా కర్ణాటక – ఆంధ్రకు రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి ప్రధాన రహదారికి ఇరువైపులా చేపట్టిన కేబుల్ నేట్ వర్క్ పనులతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కనే కేబుల్ లైన్ వేసేందకు పెద్ద గుంతలు తవ్వి మట్టిని రోడ్డుపై పోశారు. నెలలు గడుస్తున్నా గుంతలు పూడ్చలేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ డీఈ రవిశంకర్‌రెడ్డిని అడగ్గా ఓ వైపు నుంచి గుంతలు పూడ్చుకుంటూ వస్తున్నారు.. వెంటనే గుంతలు పూడ్చాలని కేబుల్ కాంట్రాక్టర్‌ను ఆదేశిస్తామని చెప్పారు.


బళ్లారి - కళ్యాణదుర్గం రహదారిలో ఉద్దేహాళ్ వద్ద రోడ్డుపక్కన వదిలేసిన గుంత

ఉరవకొండ ఎంపీపీకి పరామర్శ


ఉరవకొండ ఎంపీపీ నరసింహులును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, నాయకులు

ఉరవకొండ: మండలంలోని వెలిగొండ గ్రామంలోని ఎంపీపీ నరసింహులును మాజీ ఎమ్మెల్యే, పార్టీ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి పరామర్శించారు. ఆదివారం వెలిగొండలోని ఎంపీపీ నివాసానికి వెళ్లి ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరన్న, పార్టీ పట్టణ, రూరల్, మండల సమన్వయకర్తలు ఈడిగ ప్రసాద్, ఎర్రిస్వామి రెడ్డి, ఓబన్న, పార్టీ నాయకులు గోవిందు, బవవరాజు, శర్మాస్, వేమన్న, ధనంజయ, జోగి బీమా, మహానంది, అయ్యర్‌దాదు, చిన్న భీమ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టిశ్రీరాములు జయంతి


పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

రాయదుర్గంటౌన్: పట్టణంలో ఆదివారం పొట్టి శ్రీరాములు 123వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీమాత ఆలయంలోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జయంతి సురేష్‌కుమార్, సభ్యులు సుదర్శన్, శ్రీమన్నారాయణ, గెల్లి వాసు, ఉమామహేశ్వరయ్య పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలకు డిమాండ్

రాయదుర్గంటౌన్: ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరం చేరేందుకు డిమాండ్ పెరిగింది. ఆరో తరగతిలో ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఉంది. ఆరో తరగతిలో ప్రవేశాలకు ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకుంటున్నారు. జిల్లాలోనే గుత్తి మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు అత్యధికంగా 259 మంది దరఖాస్తు చేసుకోగా, రెండో స్థానంలో రాయదుర్గం మోడల్ స్కూల్‌లో 222 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో (https://apms.apcfss.gov.in) దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

నేటి నుంచి దరఖాస్తుల ఆహ్వానం

శెట్టూరు: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గాయత్రి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 20025– 26లో ఆదర్శ పాఠశాలలో చేరదలుచుకున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏదైనా గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 10వ తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 17 నుంచి 22 మే వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. https://apms.apcfss.inలేక https://cse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

నీలగిరిస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



వజ్రకరూరు: స్థానిక కురుబ వీధిలో వెలసిన నీలగిరిస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, ఆకుపూజ, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు మెగా కంటి వైద్య శిబిరం

కంబదూరు:స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచు పద్మావతమ్మ, ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ గుద్దేళ్ల నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాల శాంతి రామ్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య శిబిరం జరుగుతుందన్నారు. కంటి జబ్బు రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

19న చలో విజయవాడ

కళ్యాణదుర్గం రూరల్: శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలపై ఈనెల 19న విజయవాడలో ధర్నా ఉంటుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటలో తెలిపారు. మారుమూల ప్రాంతాలకు తాగునీరు అందిస్తున్న శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందన్నారు. తాగునీటి ప్రాజెక్టులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే మహా ధర్నాలో కార్మికులందరూ పాల్గొనాలని కోరారు.

రేపు పాస్టర్ల సదస్సు

కంబదూరు : కళ్యాణదుర్గంలోని సీఅండ్ఐజీ మిషన్ చర్చిలో ఈనెల 18న ప్రత్యేక పాస్టర్ల సదస్సు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ల సంఘం మండల అధ్యక్షుడు జి.ప్రభుదాసు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య ప్రసంగికులుగా జీఎఫ్ఎం ఫౌండర్ రెవరెండ్ షేక్ ఇస్మాయిల్, రెవరెండ్ షేక్ బెన్సన్ రానున్నట్లు ఆయన తెలిపారు.

ఇఫ్తార్‌లో గౌని


ఇఫ్తార్ విందులో పాల్గొన్న గౌని ఉపేంద్రరెడ్డి

రాయదుర్గంటౌన్:ఉపవాస దీక్షలు, నియమనిష్టలతో నమాజ్‌లు, దైవచింతనతో శుభాలు వర్షించే మాసం రంజాన్ అని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నాయకుడు చమ్మా ఇబ్రహీం ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

ఉరవకొండ: పట్టణంలోని ముస్లింలకు ఉరవకొండ రూరల్ సీఐ సయ్యద్ చిన్నగౌస్ ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక జామీయా మసీదు వద్ద ఉన్న అల్ జామియా తాసీరియా ఎడ్యుకేషనల్ సొసైటీలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. రూరల్ సీఐ చిన్న గౌస్‌తో పాటు అర్బన్ సీఐ మహానంది, ఉరవకొండ ఎస్ఐ జనార్దన్‌నాయుడు, బెళుగుప్ప ఎస్ఐ శివ, వజ్రకరూర్ ఎస్ఐ నాగస్వామి, పాల్తూరు ఎస్ఐ మురారీలు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం ముస్లింలు సీఐను సన్మానించారు.